

నేడు మంత్రి పవన్ కల్యాణ్ పర్యటన

ప్రజాశక్తి-పిఠాపురం

డిప్యూటీ సిఎం, స్థానిక ఎంఎల్ఎ పవన్ కళ్యాణ్ గురువారం పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. గురువారం ఉదయం స్థానిక ఆర్ఆర్బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడాస్థలానికి హెలికాప్టర్‌లో చేరుకుంటారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో మాట్లాడతారు. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో టిటిడి కల్యాణ మండపాలకు శంకుస్థాపనలు చేస్తారు. పిఠాపురంలోని అంబేద్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్లో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. రైతులకు సబ్సిడీపై టార్పాలిన్‌లు, వ్యవసాయ ఉపకరణాలు పంపిణీ చేస్తారు.

జనంపై దోమల దండయాత్ర

- మురుగు నీరు, అధ్వాన పారిశుధ్య
- అటకెక్కిన నివారణ చర్యలు
- రోగాల బారిన ప్రజలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లా కేంద్రం కాకినాడలో పలు ప్రాంతాలు మురికి కూపాలుగా మారాయి. నగరంలో దాదాపు 5 లక్షల మంది జనాభా నివసిస్తుండగా అనేక చోట్ల పారిశుధ్యం అధ్వానంగా దర్శనమిస్తోంది. డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోయి పొంగిపొర్లుతున్నాయి. పూర్తిస్థాయి సిబ్బంది లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది. దోమల దండయాత్రను తట్టుకోలేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ఇటు రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం మున్సిపాలిటీలోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. పలు డ్రైనేజీలు మురికమయంగా మారి చెత్త కుప్పలు అనేక చోట్ల పేరుకుపోయి ఉన్నాయి. పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో శానిటేషన్‌పై అనేక ఫిర్యాదులు అందుతున్నా అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని పలువురు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల పోటుతో అనారోగ్యాలకు గురవుతున్నామని, మంత్రి పవన్ కళ్యాణ్ తమ సమస్యలపై స్పందించాలని కోరుకుంటున్నారు. పట్టణంలో నెలకొన్న పరిస్థితులపై అనేకసార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా అంతగా చర్యలు కనిపించడం లేదని 25 వార్డు కౌన్సిలర్ ముమ్మిడి వెంకట లక్ష్మి రత్న సుజిత ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం ఇలా అన్ని ప్రాంతాల్లోనూ దోమలు ప్రజలపై విపరీతంగా దండయాత్ర చేస్తున్నాయి. పాలకుల పట్టించుకోని కారణంగా అధికారుల నిర్లక్ష్యంతో ఎక్కడకక్కడ పెద్ద ఎత్తున అధ్వాన పారిశుధ్య పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది. మురుగు కాలవల్లో పూడికతీత పనులు సైతం సక్రమంగా నిర్వహించని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో దోమలకు ఆవాసాలుగా ఏర్పడి ప్రజలను పట్టిపీడిస్తున్నాయి. ఇప్పటికే విద్యుత్ కోతలతో సతమతం అవుతుండగా ఆపై దోమల దాడితో ప్రజలు నిద్రలేని రాత్రుళ్ల గడుపుతున్నారు. చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సిపిఎం యాత్రలో ప్రస్తావన

ఇటీవల సిపిఎం నిర్వహించిన ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా ప్రజలు అనేక సమస్యలను వివరించగా అందులో ప్రధానంగా పారిశుధ్య సమస్యలపైనే ప్రజలు గళమెత్తారు. పలు వెనుకబడిన ప్రాంతాల్లో యాత్ర బృందం పర్యటించగా అధికారుల నిర్లక్ష్యంపై ముఖ్యంగా వివరించారు. కాలువల్లోని మురుగు, వీధుల్లోని అపరిశుభ్రత కారణంగా దోమల బెడద రోజురోజుకు తీవ్రమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఫాగింగ్, ఇతర చర్యలు చేపట్టడంలో ఏ మాత్రం శ్రద్ధచూపటం లేదని ఆరోపించారు. దోమ కాటుతో ప్రజల రోగాల బారిన పడుతున్నా చలనం కనిపించడం లేదన్నారు.

జిల్లాలో కాకినాడ నగరపాలక సంస్థ, తుని, పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 385 గ్రామ పంచాయతీలుండగా సుమారు 20 లక్షల మంది జనాభా ఉన్నారు.పట్టణాల్లో అపరిశుభ్రతతో పాటు పల్లెల్లో వరి పొలాల్లోని దోమలు చీకటిపడితే ఇళ్లలోకి వస్తున్నాయి. రాత్రిళ్లు విద్యుత్తు కోతలతో ఉక్కబోత ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే మరోవైపు దోమపోటుతో జనానికి నిద్ర లేకుండా పోతోంది. కాకినాడ స్మార్ట్ సిటీలో ప్రధానంగా కొత్త కాకినాడ, సాంబమూర్తి నగర్, పర్లోవపేట, పళ్లంరాజు నగర్, దుమ్ముల పేట, శాంతినగర్ ఇందిరానగర్, పోస్టల్ కాలనీ ప్రాంతాల్లో దోమల దండయాత్ర అధికంగా ఉంది. ఈ ప్రాంతాల్లో మురుగు కాలువల్లో చెత్త చెదారం ఎక్కువగా పేరుకుపోవడంతో రోజుల తరబడి నీరు నిల్వ ఉండిపోయి దోమల దాడి పెరుగుదలకు కారణమవుతున్నాయి. పట్టణాలు, మండల కేంద్రాలలో పాటు దాదాపు అన్ని గ్రామాల్లోనూ దోమల సమస్యతో ప్రజలు నిత్యం అల్లాడుతున్నారు. గ్రామాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పైపైన చెత్తను తొలగిస్తున్నారు తప్ప పూర్తిస్థాయిలో అపరిశుభ్రంగా ఉన్న వాతావరణంలో మార్పులు తీసుకురాలేకపోతున్నారు.



పిఠాపురం మున్సిపాలిటీలో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

కానరాని ఫాగింగ్

కొన్ని ప్రాంతాల్లో మాత్రమే అడపాదడపా ఫాగింగ్ చేస్తున్నా అరకొరగానే సాగుతుందని ఆయా ప్రాంతాల ప్రజలు అంటున్నారు. దీంతో పలు వార్డుల్లో దోమల విజృంభించి ప్రజలు రోగాలతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. రెండేళ్ల క్రితం స్వచ్ఛంద్ర కార్పోరేషన్ ద్వారా ఫాగింగ్ యంత్రాలను పంపిణీ చేసినా వాటిని సక్రమంగా వినియోగించడం లేదు. వాటి నిర్వహణ కోసం పంచాయతీల్లో నిధుల సమస్య వెంటాడుతున్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో ఫాగింగ్ చేయడానికి వీలు కుదరడం లేదని పలువురు సర్పంచులు తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు నీరు నిల్వ ఉంటోంది. దీంతో దోమ కాటుకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. విద్యుత్ లేని సమయంలో ఫ్యాన్లు కూడా లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కుళాయిల వద్ద నీరు వథాగా వెళుతుండటంతో మురుగు సమస్య తీవ్రతరం అవుతోంది. ఇప్పటికైనా దోమల బెడద నుంచి విముక్తి కలిగించేలా పాలకులు, అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ధర్నా

ప్రజాశక్తి-పిఠాపురం

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాల అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిముల పరిహారాలను కార్మికులకు తక్షణం చెల్లించాలని కోరుతూ ఎపి భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్ కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పథకాలను అమలు చేయడానికి ఇంకెన్ని సంవత్సరాలు సమయం కావాలని ప్రశ్నించారు. ఇసుక ధర అందుబాటులోకి వచ్చిన కార్మికులకు ఉపాధి లేదని తక్షణం ఉచిత ఇళ్ళ నిర్మాణం కాలనీ పనులు చేపట్టి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఎన్నికల ర్యాలీల సందర్భంగా రెండు కోట్ల ఆర్థిక సహకారం కార్మికులకు అందిస్తానని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. మే 20న దేశవ్యాప్త సమ్మెలో భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుంచె చిన్న, దేగల సత్యన్నారాయణ, కరణం విశ్వనాథం, గడిగట్ల సత్తిబాబు, ఆకుల సత్యన్నారాయణ, సురేష్, సిహెచ్.సాంబశివ, బిఎన్.శ్రీను, వి.రామన్నరాజు, అప్పన్నబాబు, నుతాటి కృష్ణ, పి.గోవిందాచారి, సిఐటియు నాయకులు కాళ్ల నాగేశ్వరరావు, దారపురెడ్డి క్రాంతి, నక్కెళ్ళ శ్రీను, కామేశ్వరి, నందేశ్వరరావు, తాడిపర్తి రవి, జి.వీరబాబు, సూరిబాబు, పి.వీరబాబు, మోహనచారి పాల్గొన్నారు.



నిరసన దీక్షలో మాట్లాడుతున్న దువ్వా శేషబాబ్జి

మంత్రి పవన్ పర్యటనా ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-పిఠాపురం

ఈ నెల 25న ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎంఎలఎ పవన్ కళ్యాణ్ పర్యటన సజావుగా సాగేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. మంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లపై గురువారం కలెక్టర్ షాన్‌మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఎస్పి జి.బిందుమాధవ్ పరలిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఠాపురంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలతో పాటు రచ్చబండ కార్యక్రమం, మహిళ లబ్ధిదారులకు కుట్టు మిషన్లు, రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ వంటి కార్యక్రమాలలో డిప్యూటీ సీఎం పాల్గొంటారన్నారు. ఈ పర్యటనకు సంబంధించి ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిలిపారు. రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. సాధారణ ప్రజలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ పోలీస్ బందోబస్తు నిర్వహించాలన్నారు. ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉంటున్నందున తగినంత తాగునీరు, మజ్జిగ, ఫ్యానులు, స్నాక్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లను ఎస్పి బిందుమాధవ్ పరిశీలించారు. జరిగిందన్నారు.కలెక్టర్ వెంట డిఆర్ఒ జె.వెంకటరావు, పాడా పీడీ ఎ.చైత్రవర్షిణి, ఎస్పి వెంట ఎఎస్పిలు ఎంజెవి.భాస్కరరావు, ఎస్.శ్రీనివాసరావు, ఎస్‌డిపిఒ మనీష్ దేవరాజ్ పాటిల్ ఉన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్మోహన్

పెద్దాపురంలో 77.33 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో 10 తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల్లో కలిపి 77.33 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఇఒలు ఈరంకి ప్రభాకర శర్మ, విఆర్‌కె.చౌదరి తెలిపారు. మండల పరిధిలో 1,610 మంది పరీక్షలకు హాజరుకాగా 1,245 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. బాలురు 75.86 శాతం, బాలికలు 78.87 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చంద్రమాంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి ద్వారంపూడి అంజన్, నూక సుబ్రహ్మణ్యం 579 మార్కులు సాధించి ఫలితాల్లో మొదటి స్థానం, చదలాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి కుక్కులూరి గణేష్ 578 మార్కులతో ద్వితీయ స్థానం, రాయభూపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని పుట్టా దీపిక 573 మార్కులతో తృతీయ స్థానం సాధించారన్నారు.



వైద్య సిబ్బందితో ఎంఎల్ఎ చినరాజప్ప

మెడికవర్‌లో తల్లీ బిడ్డల సేవలు

ప్రజాశక్తి - సామర్లకోట

మెడికవర్ హాస్పిటల్స్‌లో పూర్తిస్థాయి అధునాతన 'ఉమెన్ అండ్ చైల్డ్' విభాగాన్ని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి పంతం సందీప్ గురువారం ప్రారంభించారు. అచ్చంపేటలోని ఆసుపత్రిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ చినరాజప్ప మాట్లాడుతూ ఉమెన్ అండ్ చైల్డ్ విభాగం రావడం కాకినాడ జిల్లా ప్రజలందరకూ శుభ పరిణామం అన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడలో అందుబాటులో ఉన్న మల్టీ స్పెషాలిటీ విభాగాలతో పాటు ఈ సేవలను కూడా ప్రజలకు అందుబాటులో అందించాలన్నారు. కుడా చైర్మన్ తుమ్మల బాబు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు వైద్యాన్ని అతి తక్కువ ఖర్చుతో అందిస్తున్న మెడికవర్ హాస్పిటల్స్ తల్లీ పిల్లల విభాగం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ ఎం.శుభాకర రావు మాట్లాడుతూ అధునాతన ఉమెన్ అండ్ చైల్డ్ విభాగంలో అపార అనుభవం కలిగిన గైనకాలజిస్ట్లు, పీడియాట్రిషియన్‌లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ లక్ష్మీ ప్రవీణ, డాక్టర్ కస్తూరి భాయ్, డాక్టర్ శ్రావణి సాక్షి, డాక్టర్ సుజన, డాక్టర్ ఉప్పల సుబ్బారావు పాల్గొన్నారు.

మల్లాం బహిష్కరణ నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి-పిఠాపురం

మండలంలోని మల్లాం గ్రామంలో దళితులను సాంఘిక బహిష్కరణ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జెవి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన గ్రామంలో పర్యటించారు. విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పల్లపు సురేష్ బాబు కుటుంబాన్ని పరామర్శించారు. సాంఘిక బహిష్కరణ జరిగిన తీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిఠాపురం సూర్యరాయ గ్రంథాలయంలో సాకా రామకృష్ణ అధ్యక్షతన బహిష్కరణ రాజ్యాంగ విరుద్ధం అనే అంశం మీద ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బహిష్కరణకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించకుండా శాంతి కమిటీ వేయడాన్ని తప్పు పట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, ఎస్.రాజు, రాంబాబు, గొడుగు సత్యనారాయణ,కౌన్సిలర్ పెదపాటి రాజేష్ కుమార్, కండవల్లి సుబ్బారావు, బల్ల సురేష్, దడాల చిట్టిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

సమస్యలు పరిష్కరించాలని వికలాంగుల దీక్ష

ప్రజాశక్తి-గొల్లప్రోలు

వికలాంగుల న్యాయ, చట్టపరమైన సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వికలాంగుల హక్కుల పరిరక్షణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఉలవశెట్టి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ పట్టణ స్థాయిలో వికలాంగులకు నిధులు అందకపోవడంతో ఈ రిలే నిరాహార దీక్షలు చేపట్టామని తెలిపారు. వికలాంగుల హక్కుల చట్టం 2016 అమలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలలో 5 శాతం నిధులు జిఒ అమలు చేయాలన్నారు. ఈ దీక్షలో బివివి.సత్యనారాయణ, జి.రామకృష్ణ, కనకదుర్గ, కృష్ణ, పి.అప్పారావు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న వికలాంగులు

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- తాళ్ళరేవు

నీలపల్లి, ఇంజరం గ్రామ పంచాయతీలలో గురువారం సుమారు రూ.రెండు కోట్లతో అభివృద్ధి పనులను ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. నీలపల్లిలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.80 లక్షలతో సిసి రోడ్డు, రూ.40 లక్షలతో 3 తరగతి గదులు, ఇంజరం పంచాయతీలో సుమారు రూ.70 లక్షల వ్యయంతో సిసి రోడ్లు, తరగతి గదుల అభివృద్ధి పనులను ఎంఎల్ఎ ప్రారంభించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్ఎం కోట శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టెన్త్ టాపర్లు పెనుగొండ నవ్య ఆశ్రిత, మేడిశెట్టి మంజుల, మానే మనోజ్ఞ లక్ష్మిని ఎంఎల్ఎ సుబ్బరాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, నీలపల్లి సర్పంచ్ చిట్టూరి నాగమణి, కల్కి మూర్తి, ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరాం ప్రసాద్, గంట గోపి,కోరుకొండ కిరణ్ కుమారి, చంటి, భాస్కర రాజు, మోపూరి వెంకటేశ్వరరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, ఎంఇఒ మంగాయమ్మ పాల్గొన్నారు.



క్రీడల్లో విజేతలతో ఆదిత్య సిబ్బంది

ఆదిత్యలో క్రీడల ముగింపు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో గురువారం ఇంట్రామ్యూరల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, చెస్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డీన్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధిపతి డాక్టర్ ఎన్.రవి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి-కాజులూరు

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అవలంబించాలని, తద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి, సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అన్నారు. గురువారం కోలంక గ్రామంలోని వింగ్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో కరస్పాండెంట్ దేగల రాంబాబు ఆధ్వర్యంలో 8వ వార్షికోత్సవంలో సత్యం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యను మించిన సంపద మరొకటి లేదని, ప్రణాళికాబద్ధంగా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. నేటి ఆధునిక యుగంలో విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రామచంద్రపురం ఇన్‌ఛార్జి పొలిశెట్టి చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్ కుమార్, సీనియర్ హైకోర్టు అడ్వకేట్ విజయ్, పాఠశాల డైరెక్టర్ దేగల వాణి, వింగ్స్ హైస్కూల్ ప్రిన్సిపల్, సిబ్బంది, కూటమి నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం హైస్కూల్ ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో అధ్యాపక సిబ్బంది వాసంశెట్టి సత్యంను ఘనంగా సత్కరించారు.

బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి -కరప

కరప మండలంలోని బాణాసంచా తయారీ కేంద్రాల్లోని భద్రతా చర్యలపై అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. తహశీల్దారు ఎన్.సత్యనారాయణ, ఎస్ఐ టి.సునీత, సహాయ కార్మిక అధికారి వి.పద్మావతి, జగన్నాథపురం ఎడిఎఫ్ఒ బి.ఏసుబాబు, అగ్ని ప్రమాద నియమాలు, ఇతర జాగ్రత్తలపై తనిఖీలు నిర్వహించారు. తయారీ కేంద్రాల్లోని అనుకోని ఘటనలు జరగకుండా ఉండేందుకు పటిష్టమైన భద్రత చర్యలు పాటించాలని. పిల్లలను తయారీ కేంద్రాల్లో పని చేయించరాదని అధికారులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తయారీదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పంచాయతీల బలోపేతానికి కృషి

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా గురువారం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ రూరల్ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కీలకమైన పంచాయతీరాజ్ వ్యవస్థ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కృషితో బలోపేతం కానున్నాయని మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సుబ్బారావు, ఎస్.శ్రీనగేష్, ప్రసాద్ నాయుడు, డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

ఏలేశ్వరం వివిధ గ్రామాలలో నిర్వహించిన ర్యాలీల్లో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వరుపుల తమ్మయ్య బాబు, పెంటకోట మోహన్, టిడిపి నాయకులు జ్యోతుల పెదబాబు, సూతి బూరయ్య, చిక్కాల లక్ష్మణరావు, బస ప్రసాద్, మైరాల కనకారావు, పలివెల శ్రీను, నూకతాటి ఈశ్వరుడు ఉన్నారు.


శంఖవరం స్థానిక మండల కార్యాలయంలో ఎంపిడిఒ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి పర్వత గుర్రాజు పాల్గొన్నారు. అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేశారు.

యు.కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ రవికుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్, గాంధీ చిత్రపటాలకు పూలమాలవేసి తొలిత నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు

పెద్దాపురం మండల పరిధిలోని 23 గ్రామాల్లో పంచాయతీరాజ్ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎంపిడిఒ శ్రీలలిత అధ్యక్షతన సభలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విస్తరణాధికారి త్సలికి దొరబాబు, ఎఒ ఎం.సత్యనారాయణమూర్తి, ఎంపిటిసిలు బత్తిన రవణమ్మ, కాలే అనురాధ, మండల కో ఆప్షన్ సభ్యులు బిక్కిన శేషకుమారి, చంద్రశేఖర్, మహేష్, రాజు, గంగాధర్ పాల్గొన్నారు.

సామర్లకోట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె.హిమామహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు పాల్గొని మాట్లాడారు. తొలుత అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పరిధిలోని అచ్చంపేట, పనసపాడు, మాధవపట్నం, జి.మేడపాడు, ఉండూరు పంచాయతీల్లో పారిశుధ్యకార్మికులు పోసపల్లి వెంకటరమణ, పువ్వల నాగేశ్వరరావు, బండారి శ్రీను, మురమళ్ళ సత్యనారాయణ, గొర్రెల సతీష్, మోరుకుర్తి రాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జి.మేడపాడు సర్పంచి పటాని దేవి పాల్గొన్నారు.

కరప పంచాయితీలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.అనుపమ, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, జనసేన నేత భోగిరెడ్డి గంగాధర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు బ్రహ్మానందం, సుధారాణి, విఆర్ఒ హరిశ్చంద్ర, కడియాల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మేడిశెట్టి పాపారావు, నక్క బ్రహ్మాజీ, ఆలమూరు చిన్నారావు, ఎఎన్ఎం చంద్రకళ, సర్పంచ్ గోన అనూష పాల్గొన్నారు.



కాకినాడ రూరల్‌లో కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సభ్యులు



సామర్లకోటలో పారిశుధ్య కార్మికులకు సత్కారం



యు.కొత్తపల్లిలో అంబేద్కర్, గాంధీ చిత్రపటాలకు సిబ్బంది నివాళి



శంఖవరం మండల కార్యాలయంలో పాల్గొన్న ఎంపిడిఒ, సిబ్బంది

నేరాలు ఘోరాలు

ఏలేరులో స్నానానికి దిగి అమ్మమ్మ, మనవడు మృతి

ప్రజాశక్తి-పిఠాపురం

మండలంలోని ఎర్రవరం జాతీయ రహదారి సమీపాన ఏలేరు నదిలో స్నానానికి దిగి అమ్మమ్మ మనవడు మృతి చెందిన సంఘటన గురువారం వెలుగు చూసింది. ఎస్ఐ ఎస్ రామలింగేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడుకు చెందిన అరటకొట్ల సత్యవతి (52) తన కూతురు కొడుకు గోర్ల వీర మనోజ్ (12)ను తీసుకుని బుధవారం సాయంత్రం ఏలేరు కాలువలో స్నానానికి దిగారు. ఉధృతంగా పోవడంతో ఇద్దరూ మునిగి చనిపోయారు. గురువారం సత్యవతి మృతదేహం నీటిలో తేలింది. స్థానికుల గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలువ గట్టుపై ఇద్దరి చెప్పులు ఉండడంతో అనుమానం వచ్చి గాలింపు చర్యలు చేపట్టగా మనోజ్ మృతదేహం లభించింది. వీరి ఇంటి సమీపంలో ఉన్న గ్రామ దేవత ఉత్సవాలు ఉండడంతో పవిత్ర స్నానం చేసేందుకు ఏలేరు కాలువలో స్నానానికి వచ్చినట్లు కుమార్తె రమణమ్మ, అల్లుడు రాజు తెలిపారు. మృతదేహాలను ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘర్షణలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - కాజులూరు

మండల పరిధిలో సమస్యాత్మక మత్స్యకార గ్రామమైన పల్లంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరగడంతో నలుగురికి గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పల్లం గ్రామ పంచాయతీ పరిధిలోని కుమారులు దగ్గర నీళ్ళు పట్టుకుని ఇంటికి వెళుతున్న సమయంలో మహిళల పట్ల ఒకరిపై ఒకరు దూషించు కున్నారు. దీంతో ఇరు కుటుంబాల మధ్య గురువారం వివాదం చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో మల్లాడి చిన్నవీర్రాజు, మల్లాడి లక్ష్మణ్, మల్లాడి ధర్మారావు, మల్లాడి దమయంతిలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇక్రగ్రాతులను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో దింపు కార్మికుడు మృతి

ప్రజాశక్తి - చాగల్లు

నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామానికి చెందిన దింపు కార్మికుడు కోళ్ల ధనరాజు(22) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. చిక్కాల గ్రామ శివారులో ఉన్న కొబ్బరి తోటలో కొబ్బరికాయలు దించేందుకు గురువారం వెళ్లాడు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కొబ్బరికాయలు దించుతున్నాడు. కొబ్బరి ఆకు ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ వైరును తాకడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ధనరాజు సోదరుడు కోళ్ల శివ ఫిర్యాదు మేరకు చాగల్లు ఎస్ఐ కె.నరేంద్ర కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేకాడుతున్న 8 మంది అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు శివారు మీనా నగరంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేశామని ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు. వారి నుంచి రూ.8వేల నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

బోట్స్ క్లబ్ వద్ద బారికేడ్లు పెట్టాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

బోట్స్ క్లబ్ ఉద్యానవనం ప్రధాన గేటు ఎదురుగా జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున ట్రాఫిక్ బారికేడ్స్ ఏర్పాటు చేయాలని వాకర్స్ సంఘం అధ్యక్షుడు అడబాల రత్న ప్రసాద్ రాజ్యసభ సభ్యులు సానా సతీష్ కార్యాలయంలో ప్రజా దర్బార్‌లో గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అడబాల మాట్లాడుతూ పార్క్ ఎదురుగా గల ప్రధాన గేటు నుంచి ఉదయం, సాయంత్రం వేళ పెద్ద ఎత్తున వాకర్స్, పార్కు సందర్శకులు బయటకు లోపలికి వస్తుంటారని అన్నారు. ఉద్యానవనంలోకి రాకపోకలు జరిగే సమయంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు.

మంచి ఆహారపు అలవాట్లు అవసరం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అవసరమని పిఎంపి వైద్యులు కె.సూర్య ప్రకాష్ పేర్కొన్నారు. బోట్ క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆహారంలో కొవ్వు, తీపి పదార్థాలు పరిమితంగా తీసుకోవాలన్నారు. అన్ని రకాల ఆహార పదార్థాలను తగిన పరిమాణంలో తీసుకోవాలని అన్నారు. ఒకేసారి కాక నాలుగైదుసార్లు కొద్ది కొద్దిగా తీసుకోవాలని సూర్య ప్రకాష్ తెలిపారు. వాకర్స్ సంఘం అధ్యక్షుడు అడబాల రత్న ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్ సభ్యులు ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి సహకారం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి రైతులకు సహాయ సహకారాలు అందిస్తున్నారని ఉపాధి హామీ పథకం ఎపిఒ సుధీర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ సన్న చిన్న కారు రైతులకు పండ్ల తోటల పెంపకంలో మూడేళ్ల పాటు ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ రకాల సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ తోటల రైతులు మొక్కలకు నీరు పోసేందుకు రైతులకు ఉపాధి వేతనాలు ఇస్తారన్నారు.

పామాయిల్ తోట పరిశీలన

ప్రజాశక్తి - గోపాలపురం

విద్యుత్ వైర్ షార్ట్ సర్క్యూట్ వల్ల కలిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైన పామాయిల్ తోటను విద్యుత్ శాఖ ఏఇ డి.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ ప్రమాదంలో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లింది. పొలంలో షార్ట్ సర్క్యూట్ ఏమి జరగలేదని తెలిపారు. ఈ అగ్ని ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరగలేదని స్పష్టం చేశారు.

యానాం వార్తలు



పుదుచ్చేరిలో నిరసన తెలుపుతున్న ఎంఎల్ఎ అశోక్

డంపింగ్ యార్డ్‌పై పుదుచ్చేరిలో నిరసన

ప్రజాశక్తి - యానాం

60 రోజులుగా యానాం పట్టణంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడ నిలిచిపోయి పట్టణంలో ప్రతి వీధి ఒక్కో డంపింగ్ యార్డ్ గా తయారైందని, సమస్యను పరిష్కరించకపోతే నిరాహారదీక్షకు దిగుతానని సిఎం రంగసామికి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్పష్టం చేశారు. గురువారం ఆయన పుదుచ్చేరిలో నిరసన తెలిపారు. మరో ఎంఎల్ఎ శివశంకరన్‌తో కలిసి సిఎం రంగసామి కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి యానాం పారిశుద్ధ్య పనులు నిలిచిపోవడంతో వీధిలో దుర్గంధం వ్యాపించి ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. చెత్తను తొలగించకుండా, డంపింగ్ యార్డ్‌కు స్థలం కేటాయించకుండా ప్రభుత్వం చోద్యం చూస్తుండడం దారుణమన్నారు. ఆర్ఎఒ సమస్యను కలయావన చేయడానికి కోసం కావాలనే దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్ళిపోతున్నారని తెలిపారు. పుదుచ్చేరిలో తాను నిరసనకు దిగుతున్నట్లు ముందు రోజే సమాచారం తెలుసుకుని కలెక్టర్‌ను యానాం పంపడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యాలను రాజకీయాలతో ముడిపెట్టడం తద్వారా లబ్ధి పొందాలి అనుకోవడం ప్రజా నాయకులకు తగదని స్పష్టం హితవు పలికారు.

ఫిట్ ఇండియా సైక్లింగ్

ప్రజాశక్తి - యానాం

స్థానిక బాలయోగి క్రీడా ప్రాంగణంలో సాయ్ స్పోర్ట్స్ ఇంచార్జ్ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా సైక్లింగ్ రైడ్‌ను గురువారం నిర్వహించారు. ఈ మేరకు సిఐ ఆదిలరసన్, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు సైక్లింగ్ రైడ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ సైక్లింగ్ ప్రాముఖ్యతను వివరించారు. సైక్లింగ్‌ను ఆరోగ్యపరమైన రవాణా మార్గంగా ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సైక్లింగ్ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యకరమైన జీవనశైలిని రూపొందించడంలో సహాయపడుతుందన్నారు. ప్రతి రోజు ఒక గంట పాటు సైక్లింగ్ చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోలీసులు యానాం పోలీస్ లీగ్ పేరిట క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఐఆర్‌బి టీమ్ విజయం సాధించి ట్రోఫీ గెలుచుకున్నట్లు తెలిపారు.




డంపింగ్ యార్డు కోసం స్థలాలను పరిశీలిస్తున్న పుదుచ్చేరి కలెక్టర్ కులుంగోత్తన్

డంపింగ్ యార్డుకు స్థలాల పరిశీలన

ప్రజాశక్తి- యానాం

పుదుచ్చేరి కలెక్టర్ కులుంగోత్తన్ యానాంలో గురువారం పర్యటించారు. ఉదయం రాజమహేంద్రవరం విమానాశ్రయంలో దిగిన ఆయనకు ఆర్ఎఒ మునిస్వామి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో యానాం వచ్చారు. అనంతరం చెత్త వేయడానికి డంపింగ్ యార్డ్ కోసం వివిధ ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. కనకాలపేట, గోపాల్ నగర్, కురసాంపేట, పందుల్లంక తదితర ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆయా స్థలాలు గూర్చి వివరించారు. స్థలాల పరిశీలన శుక్రవారం తుది నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, పిడబ్ల్యుడి తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.



రాష్ట్ర సదస్సులో పాల్గొన్న సర్పంచ్ కుమార్ రాజా

అన్నవరం సర్పంచ్‌కు అరుదైన గౌరవం

ప్రజాశక్తి-శంఖవరం

మండలంలోని అన్నవరం గ్రామ సర్పంచ్ ఎస్.కుమార్ రాజాకు అరుదైన గౌరవం దక్కింది. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకుని మంగళగిరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో అన్నవరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా పాల్గొన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో కాకినాడ జిల్లా నుంచి 10 మంది సర్పంచులు పాల్గొనగా కుమార్ రాజా అవకాశం లభించడం పట్ల వార్డు సభ్యులు గ్రామస్తులు హర్షం తెలిపారు.

పలువురికి ముద్రగడ గిరి పరామర్శ

ప్రజాశక్తి -రౌతులపూడి

మండలంలోని పలు కుటుంబాలను వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ ముద్రగడ గిరి గురువారం పరామర్శించారు. ఇటీవల గుమ్మరేగుల గ్రామానికి చెందిన జయ బాబు ప్రమాదవశాత్తు ఏలేరు కాలువలో పడి మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు అనంతరం ఎం.చామవరం గ్రామానికి చెందిన ఎమిల్లి వీరబాబు ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో ఆయనను పరామర్శించారు. రౌతులపూడికి చెందిన వాసిరెడ్డి కొండల స్వామి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైసిపి మండల అధ్యక్షుడు చింతకాయల వీర వెంకట సత్యనారాయణ, మాజీ జెడ్‌పిటిసి చెన్నెడ సత్తిబాబు, వాసిరెడ్డి భాస్కర్ బాబు, వాసిరెడ్డి జమీలు, సర్పంచ్ రాపర్తి రామకృష్ణ ఉన్నారు.

100 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గండేపల్లి

ఉప్పలపాడులో సర్పంచ్ అడబాల రామాంజనేయులు ఆధ్వర్యంలో శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యాన గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ అన్ని అవయవాలలోనూ కన్ను చాలా ముఖ్యమైనదని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు దంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. పరిసర గ్రామాల నుంచి సుమారు 100 మంది కంటి పరీక్షలు చేయించుకున్నట్టు తెలిపారు. పరీక్షలు చేసిన అనంతరం ఆపరేషన్ చేయించుకునేవారు ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాయుడు జ్యోతి పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ ర్యాలీలు

కాశ్మీర్, పెహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ గురువారం పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ సజ్జన సమాజ్ ఇంటర్నేషనల్, ఎక్స్ ఆర్మీ వెల్ఫేర్ అసోసియేషన్, ఇగ్నైటెడ్ హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ చెరువు నుంచి జెడ్‌పి సెంటర్‌లోని వార్ మెమోరియల్ వరకు క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. ఈ దాడిని మానవత్వంపై, శాంతిపై దాడిగా అభివర్ణించారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సజ్జన సమాజ్ ఇంటర్నేషనల్ ఫౌండర్ అండ్ చైర్మన్ ఆచార్య ఎంఎ.అభిలాష్, మాజీ సైనికులు అడపా శంకర్, ఆర్‌జి.సూర్యారావు, డి.బుల్లబ్బాయి, ఎస్‌సలీం, ఎజి.మోహన్ రావు పాల్గొన్నారు

కాకినాడ రూరల్ రమణయ్యపేటలో అడబాల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్మీ విశ్రాంతి ఉద్యోగి ఎస్.శ్రీనగేష్, న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు, మాట్లాడారు. తొలుత మౌనం పాటించి మృతులకు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ శిరీష, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

తాళ్లరేవు సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి చెరువుగట్టు సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు, మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నీడి వెంకటరమణ, విఒఎల సంఘం నాయకులు ఈశ్వరీబాయి, అగ్నికుల క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షులు వైదాడి నూకరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు అదృష్టదీపుడు, బొంతు మోహన్, నల్లి ఈశ్వరరావు, కుడుపూడి మల్లేష్, గంటా దిలీప్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు వైసిపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యాన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి మహాత్మా గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. యాసలపు సూర్యారావు భవనం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ శోభా థియేటర్ మీదుగా నువ్వులగుంట వీధిలోని భగత్ సింగ్ విగ్రహం సెంటర్ వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా పిసిసి కార్యదర్శి రొంగల అరుణ్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పిసిసి గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్, కార్యదర్శి కూనిరెడ్డి అరుణ, సభ్యులు అమృత. మణికంఠ, రవికుమార్, దారపు రెడ్డి క్రాంతికుమార్, దారపురెడ్డి కృష్ణ, పెంటయ్య పాల్గొన్నారు.

గొల్లప్రోలు పట్టణంలో ఆర్యవైశ్య నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దంగేటి రామకృష్ణ, నానాజీ, వాసు పాల్గొన్నారు.



కాకినాడలో ర్యాలీ నిర్వహిస్తున్న పలు సంస్థల సభ్యులు



పెద్దాపురంలో ర్యాలీలో పాల్గొన్న మహిళలు



గొల్లప్రోలులో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు



ప్రత్తిపాడులో ర్యాలీలో పాల్గొన్న ముద్రగడ గిరి

28 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 28 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రామకృష్ణారావుపేట శాఖా గ్రంథాలయాధికారి కె.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆనందభారతి గ్రౌండ్స్‌లో ఈ శిబిరం జూన్ 6వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్నాహ్నం 12 గంటల వరకూ నిర్వహించే ఈ శిబిరంలో స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, కథలు చెప్పడం, కథలు వినిపించడం వంటి అంశాల్లో శిక్షణ ఉంటుందని, కావున పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కాజులూరు

మరమ్మతు పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని కాకినాడ విద్యుత్ ఆపరేషన్స్ ఇఇ ఉదయభాస్కర్ తెలిపారు. విద్యుత్ సరఫరాలో అవాంతరాలను తొలగించేందుకు చెట్ల కొమ్మలను తొలగించే పనిలో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 33/11 కెవి కుయ్యేరు సబ్ స్టేషన్ 11కెవి ఫీడర్స్ పరిధిలోని దుగ్గుదుర్రు, దుగ్గుదుర్రుపాటి, మేకలగరువు, కుయ్యేరు, ఉప్పుమిల్లి, చింతల్లంక, రేగుబడవ, అంద్రంగి గ్రామాలకు, దుగ్గుదుర్రు, కుయ్యేరు, ఉప్పుమిల్లి, పల్లిపాలెం గ్రామాలలో ఇండస్ట్రియల్ మరియు ఆక్వా ఏరియాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.



శారదా విద్యాలయంలో వార్షికోత్సవం

ఘనంగా శారదా విద్యాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని దుర్గాడలో శారదా విద్యాలయ పాఠశాల స్థాపించి 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా రజతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బి శివప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ప్రగతికి మూలం ప్రశ్నని విద్యార్థులు ప్రశ్నించడం అలవర్చుకోవాలని ఆయన అన్నారు .పాఠశాల స్థాపించి నేటి వరకు పాఠశాల అభివద్ధి మరియు పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రగతిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివరించారు పలువురు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు.ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ఏపీఎస్ఆర్టీసీ డిఎం తేలు పెద్దిరాజు, కత్తిపూడి జడ్పీహెచ్ఎస్ స్కూల్ హెచ్ఎం ఆకెళ్ళ శ్రీనివాసు, ఆకొండి వెంకటేశ్వర శర్మ, ఆకుల రామకష్ణ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ , విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మెయిన్ రోడ్డు వెంకటేశ్వర స్వామి గుడి సెంటర్‌లో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం కుడా చైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు గురువారం ప్రారంభించారు. ప్రస్తుత వేసవిలో ఎండలు తీవ్రతరంగా ఉన్నందున మజ్జిగ చలివేంద్రాలు విరివిగా ఏర్పాటు చేయవలసి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సాయి ప్రసాద్, ఆలయ సిబ్బంది శివ దుర్గాప్రసాద్, రాజబాబు, టిడిపి నాయకులు తూతిక రాజు, కటారి శ్రీనివాసరావు, తమనార లక్ష్మణ్ దివాకర్, శ్రీరామ్ పాల్గొన్నారు. మరిడమ్మ ఆలయం వద్ద ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం నిర్వహించారు.

'పిఎం సూర్యఘర్'పై అవగాహన

ప్రజాశక్తి - పెరవలి

మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం పిఎం సూర్యఘర్ యోజన పథకంపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎపిఇపిడిసిఎల్ నిడదవోలు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పియుబి.శ్రీధర్ హాజరై మాట్లాడారు. ఈ పథకం గురించి లబ్ధిదారులకు వివరించారు. సాధ్యమైనంత ఎక్కువమందికి అవగాహన కల్పించడానికి సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు.

చాగల్లు : పిఎం సూర్య ఘర్‌లో చేరితే ఒక్క రూపాయి కూడా కరెంట్ బిల్లు కట్టనవసరం లేదని ట్రాన్స్‌కో ఎఇ సుంకర త్రిమూర్తులు తెలిపారు గురువారం మండల సమాఖ్య కార్యాలయంలో సోలార్ విద్యుత్‌పై మహిళా సంఘాలకు అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు. ప్రధాని పిలుపు మేరకు ప్రతి ఒక్కరు సోలార్ కరెంట్‌ను పెట్టుకోవడానికి ముందుకు రావాలన్నారు.

హెచ్ఎం సుబ్బారావు మృతి బాధాకరం

ప్రజాశక్తి - గోపాలపురం

హెచ్ఎం విరిసిపోము సుబ్బారావు ఆకస్మిక మృతి బాధాకరమని ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు, తోటి ఉపాధ్యాయులు అన్నారు. స్థానిక బిసి కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సుబ్బారావు గుండెపోటుకు గురై బుధవారం మరణించారు. ఆయన 28 ఏళ్ల పాటు విద్యారంగంలో కొనసాగారు. 2026లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఆయన భౌతిక కాయాన్ని ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారులు, గ్రామ స్తులు సందర్శించి నివాళులర్పించారు.